# డ్రగ్స్కు దూరంగా.. చదువుకు దగ్గరగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ఆదిలాబాద్:** బాలల రక్షణ, వారి ఉజ్వల భవిష్యత్తును కాపాడటం సమాజంలోని ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 'ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా టీనేజ్ గర్భాల నివారణ, ఎలోప్మెంట్, డ్రగ్స్ నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత "డ్రగ్స్కు దూరంగా– చదువుకు దగ్గరగా" ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. టీనేజ్ గర్భాలు, బాల్య వివాహాలతో బాలికల ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఇలాంటి అనర్థాలపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు ప్రేమ వ్యవహారాలు, కేసుల బారిన పడకుండా పాఠశాలల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆపదలో ఉన్న బాలల కోసం 24 గంటలు అందుబాటులో ఉండే 1098 చైల్డ్ హెల్ప్లైన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ప్రిన్సిపల్ లలిత, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలల రక్షణలో అందరూ భాగస్వాములు




**నేరడిగొండ:** బాలల రక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. బాలల భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని సావర్గాం, గుత్పాల గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, దీంతో బాలల భవిష్యత్తు దెబ్బతింటుందని తెలిపారు. చిన్న వయసులో గర్భధారణతో కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రాణాపాయం గురించి వివరించారు. "మొదట చదువు– తర్వాత వివాహం"★★ అనే నినాదంతో బాలికలు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ అత్యవసర సమయాల్లో 1098, 181 హెల్ప్లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ మంజుల, సర్పంచ్ జాదవ్ కళ్యాణి, ఉప సర్పంచ్, ఐకేపీ సీసీఎస్లు, వీఓలు, ఆశా కార్యకర్తలు, డీహెచ్ఈడబ్ల్యూ ఎస్ఎఫ్ఎల్ సిబ్బంది, ఐసీపీఎస్ సామాజిక కార్యకర్తలు, కిషోర బాలికలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతుల భవిష్యత్తుకు ఆయిల్ పామ్ స్వర్ణయుగం



**జనగాం:** ఆయిల్ పామ్ సాగు రైతుల భవిష్యత్తుకు స్వర్ణయుగం లాంటిదని ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తూ తొర్రూరు హరిపిరాలలో నిర్వహించిన ఆయిల్ పామ్ రైతు అవగాహన సదస్సులో పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి అనుమాండ్ల ఝాన్సీ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలిక ఆదాయ వనరుగా నిలుస్తుందని తెలిపారు. ఖమ్మం జిల్లా రైతులు ఆయిల్ పామ్ సాగుతో అభివృద్ధి సాధించారని, పాలకుర్తి రైతులు కూడా అదే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి ఆయిల్ పామ్ సాగు ప్రారంభిస్తే నాలుగేళ్ల తర్వాత నుంచి 30 ఏళ్ల పాటు ఆదాయం వస్తుందని చెప్పారు. సాంప్రదాయ పంటలతో పాటు రైతులు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ వైపు దృష్టి మళ్లించాలని అన్నారు. రైతు బాగుంటేనే గ్రామ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. తొర్రూరులో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశంపై కూడా త్వరలో స్పష్టత వస్తుందని తెలిపారు. రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కృషితో తెలంగాణలో ఆయిల్ పామ్ విప్లవం సాధ్యమైందన్నారు. భారీ సబ్సిడీలు, నర్సరీలు, సాంకేతిక సహాయం, కొనుగోలు హామీ వంటి అంశాలు రైతులకు మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున రైతులు హాజరై తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు



**తాండూర్:** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం తాండూర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల అధికారులు ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. మొత్తం 77 మంది దరఖాస్తుదారుల్లో 64 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. మండలానికి మొత్తం 13 యూనిట్లు మంజూరు కాగా, తాండూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు 4 యూనిట్లు, తాండూర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 4 యూనిట్లు, తాండూర్ ఎస్బీఐకు 4 యూనిట్లు, రేచిని తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు 1 యూనిట్ కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్పొరేషన్ ద్వారా మండలానికి ఈవీ టూవీలర్లు 28, ఈవీ త్రీవీలర్ ప్యాసింజర్ వాహనాలు 34, ఈవీ త్రీవీలర్ గూడ్స్ వాహనాలు 7, సోలార్ పంపు 1, పాల పశువులు 7 మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్యామల, తాండూర్, రేచిని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, తాండూర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతు బజార్లలో దళారులకు చోటు లేదు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్:** జిల్లాలోని రైతు బజార్లలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, కేవలం అసలైన రైతులు మాత్రమే తమ ఉత్పత్తులను విక్రయించేలా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ అధికారులతో రైతు బజార్ నిర్వహణపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతు బజార్లలో దళారులు చొరబడకుండా నిరంతరం నిఘా ఉంచాలని, గుర్తింపు పొందిన రైతులకే స్టాళ్లు కేటాయించాలని సూచించారు. బహిరంగ మార్కెట్ ధరల కంటే రైతు బజార్లలో ధరలు తక్కువగా ఉండేలా చూడాలని, ప్రతిరోజూ ధరల పట్టికను వినియోగదారులకు కనిపించేలా బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. తూకాల్లో ఎలాంటి మోసాలు జరగకుండా అన్ని స్టాళ్లలో తప్పనిసరిగా డిజిటల్ తూకపు యంత్రాలనే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేసవి తీవ్రత దృష్ట్యా రైతులు, కొనుగోలుదారులకు ఇబ్బంది కలగకుండా షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను మెరుగుపర్చాలని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. రైతు బజార్ల ద్వారా రైతులకు ఆర్థిక లాభం, సామాన్యులకు ఉపశమనం కలగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్, ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, రైతు బజార్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వరి, మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయాలి

- రహదారిపై రైతులు నిరసన
- తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**సత్తుపల్లి:** వరి, మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయాలని నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో మంగళవారం సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. నేతలు పలు గ్రామాల్లో మొక్కజొన్న, దాళ్వా వరి ధాన్యం కల్లాలను పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వేంసూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట విజయవాడ ప్రధాన రహదారిపై రైతులతో కలిసి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ, సహకార సంఘాల కొనుగోలు కేంద్రాల ద్వారా వరి, మొక్కజొన్న పంటలను తక్షణమే కొనుగోలు చేయాలని, తహశీల్దార్ అన్ని కల్లాలను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నాయబ్ తహశీల్దార్ బంతిరామ్కు అందజేశారు. తహశీల్దార్ కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారని, వచ్చాక కలెక్టర్కు నివేదిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి అర్వపల్లి గోపాలరావు మాట్లాడుతూ రైతులు పండించిన వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రహదారుల వెంట కుప్పలుగా పేరుకుపోయిందన్నారు. వర్షాలు వచ్చే సూచనలు ఉన్నందునా వెంటనే కొనుగోళ్లు, ఎగుమతులు ప్రారంభించాలని కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ తేమ శాతం లేకున్నా క్వింటాకు ఐదు కిలోలు కోత విధిస్తున్నారని ఆరోపించారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను నష్టపరుస్తున్నారని విమర్శించారు. రైతు నేత మోరంపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గన్నీ సంచుల కొరత, కొనుగోలు కేంద్రాల ఆలస్యంతో రైతులు సగం పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా నేత కొత్తా సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలకు డీజిల్ కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అర్వపల్లి వెంకటేశ్వరరావు, బేతిని నాగేశ్వరరావు, దంకర శ్రీను, రైతులు మల్లేశం, మహేష్, కామేశ్వరి, విజయనిర్మల, పుల్లయ్య, సావిత్రి, సత్యనారాయణ, ప్రభాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వితంతువులకు ఆర్థిక సాయం

**సత్తుపల్లి**: గ్రామీణాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు జాతీయ కుటుంబ ప్రయోజిత పథకం (ఎన్ఎఫ్బీఎస్) కింద వితంతు మహిళలకు ఆర్థిక సాయం అందించనున్నట్లు సత్తుపల్లి పురపాలక సంఘం అధికారులు తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 2017 ఏప్రిల్ 13 తర్వాత భర్తను కోల్పోయిన మహిళలు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన వారికి ఒకసారి రూ.20వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వివరించారు. అర్హులైన వారు మీసేవ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుని, అవసరమైన పత్రాలతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పాస్పోర్ట్ సైజు ఫోటో, రేషన్ కార్డు పత్రాలు, మరణ ధృవీకరణ పత్రం, వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల వివరాలు, బ్యాంకు పాస్బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీ సమర్పించాలని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## మంత్రి తుమ్మలను కలిసిన పాత మిత్రులు



**సత్తుపల్లి:** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసంలో మంగళవారం పలు ప్రాంతాలకు చెందిన ఆయన పాత మిత్రులు, సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మిత్రులు భవాని శంకర్, కిలారి నాగేశ్వరరావు, వెల్ది జగన్మోహన్, సంజీవ్ రెడ్డి తదితరులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ ఉమ్మడి రాజకీయ ప్రస్థానాన్ని స్మరించుకుంటూ, పాత మిత్రుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చాలా కాలం తర్వాత పాత మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అలాగే ఆయా నియోజకవర్గాల తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిసింది.

## మాజీ ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు



**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుమ్రం కోటేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కుమ్రం కోటేష్ మాట్లాడుతూ సోయం బాపురావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. గిరిజన హక్కుల పోరాటాల్లో ఆయన చేసిన కృషి మరువలేనిదని, ఎంపీగా జిల్లా అభివృద్ధికి తనవంతు సహకారం అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాయకత్వంలో ఆదర్శంగా నిలిచిన బాపురావు

- మాజీ ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**ఆదిలాబాద్:** మాజీ ఎంపీ సోయం బాపురావు నాయకత్వంలో ఆదర్శంగా నిలిచారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మాజీ ఎంపీ పుట్టినరోజు వేడుకల సందర్భంగా మంగళవారం టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ గంద్రత్ సుజాత, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పిప్పల్ కోటి సర్పంచ్ దాసరి రమేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ సోయం బాపురావు ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటారని, మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరే పొచ్చన్న, కన్య ప్రభాకర్ రెడ్డి, దండు మధుకర్, పుంద్రు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# ప్రజల ఆశీస్సులతో మరింత సేవ చేయాలి



**ఆదిలాబాద్:** ప్రజల ఆశీస్సులతో మరింత సేవ చేయాలని బోథ్ నియోజకవర్గ మైనార్టీ చైర్మన్ ముస్తఫా అన్నారు. మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సోయం బాపురావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముస్తఫా ఆయనను కలిసి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సోయం బాపురావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధిలోనూ, ప్రజాసేవలోనూ సోయం బాపురావు పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. సోయం బాపురావు మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొమరం కోటేశ్వర్, ఇచ్చోడ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కరుణాకర్, జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు ఆసిఫాన్, జిల్లా సెక్రటరీ బద్దం పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్ రెడ్డి, షాదుల్లా, షేక్ మహబూబ్, మజీద్ ఖాన్, మోసిన్ ఖాన్ తదితర మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వార్డు సమస్యలపై సభ్యురాలి పరిశీలన

**గంభీరావుపేట:** మండల కేంద్రంలోని ఉస్మాన్పుర 14వ వార్డు సభ్యురాలు పిట్ల శ్రీమతి మంగళవారం సాయంత్రం వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వార్డులో సీసీ రోడ్డు లేకపోవడంతో పాదచారులు, వృద్ధులు, చిన్నపిల్లలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి సమస్య కూడా ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా వీధుల్లో చెత్త సేకరణకు వాహనం లేకపోవడంతో చెత్తను మురుగు కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో వేయాల్సి వస్తోందని, దీంతో దోమలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చెత్త సేకరణ వాహనం ఏర్పాటు చేయాలని సభ్యురాలిని కోరారు. ఈ సమస్యలపై స్పందించిన వార్డు సభ్యురాలు త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇతర సమస్యలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



**గంభీరావుపేట:** కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక తహశీల్దార్ మారుతి రెడ్డి సీసీలు, సెంటర్ ఇంచార్జిలను ఆదేశించారు. మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు సముద్ర లింగాపూర్, కొత్తపల్లి లింగన్నపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలను పరిశీలించి వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు తాగునీటి సౌకర్యం, గన్ని బ్యాగులు తదితర అవసరమైన సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసిన ఆయన రైతుల నుంచి వచ్చే ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అన్లోడ్ చేయాలని మిల్లర్లకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిదేనని స్పష్టం చేశారు. ఆయన వెంట ఆర్ఐ ప్రశాంత్, సంబంధిత గ్రామాల జీపీఓలు ఉన్నారు.

# ప్రభుత్వ శాఖల మధ్య 'విద్యుత్' మంటలు

- **విద్యుత్ శాఖ ఏఈ అరెస్ట్**

**నేరడిగొండ:** నేరడిగొండ మండల కేంద్రంలో అటవీ శాఖ, విద్యుత్ శాఖ అధికారుల మధ్య చెలరేగిన వివాదం ముదిరి పాకాన పడింది. చెట్ల కొమ్మల నరికివేత వివాదంలో సోమవారం అర్ధరాత్రి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నాగేంద్ర ప్రసాద్ను అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేయడం సంచలనం సృష్టించింది.

**అసలేం జరిగిందంటే..?**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను రెండు రోజుల క్రితం విద్యుత్ శాఖ సిబ్బంది కలప కోత మిషన్తో తొలగించారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా చెట్లు నరుకుతున్నారంటూ అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని మిషన్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇరు శాఖల అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

**ప్రతీకార చర్యలేనా..?**

ఈ ఘర్షణ నేపథ్యంలో అటవీ శాఖ కార్యాలయానికి విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నాయనే కారణంతో విద్యుత్ సిబ్బంది సరఫరాను నిలిపివేశారు. దీనికి ప్రతిచర్యగా గతంలో గుత్పాల గ్రామ శివారులో వందకు పైగా చెట్లను నిబంధనలకు విరుద్ధంగా నరికివేశారనే పాత కేసును తెరపైకి తెస్తూ.. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12.30 గంటల సమయంలో అటవీ శాఖ అధికారులు ఏఈ నాగేంద్ర ప్రసాద్ ఇంటికి వెళ్లి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను ఆదిలాబాద్కు తరలించారు. ఇదిలా ఉండగా నిబంధనల ప్రకారం ఎక్కడైనా చెట్లు, కొమ్మలు నరకాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని మండల అటవీ రేంజ్ అధికారి బి.గణేష్ తెలిపారు. గతంలో కూడా విద్యుత్ శాఖ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించి వందలాది చెట్లను నరికివేశారని, చట్టప్రకారం చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

**మండలంలో చర్చనీయాంశం..**

రెండు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఒక గెజిటెడ్ అధికారిని అర్ధరాత్రి వేళ అరెస్టు చేయడంపై మండల వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాల్సింది పోయి, ఇలా అర్ధరాత్రి అరెస్టులతో భయాందోళనలకు గురి చేయడం సరికాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# వేంసూరులో అభివృద్ధి పనులకు వేగం

- **ఉపాధిహామీ పనులతో గ్రామానికి కొత్త ఊపు**



**సత్తుపల్లి:** నియోజకవర్గంలోని వేంసూరు గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులు గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో రాళ్లచెరువు అలుగు, లింక్ కెనాల్లో పెరిగిన జంగిల్ తొలగింపు పనులను సర్పంచ్ స్వయంగా పర్యవేక్షిస్తూ కార్మికులతో కలిసి ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ చర్యలతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు సాగుభూములకు నీటి సరఫరా మరింత సులభం కానుంది. కాలువల్లోని మురుగు, మొలిచిన మొక్కలను తొలగించడంతో నీటి ప్రవాహం సజావుగా సాగి, వరదల సమయంలో వచ్చే ఇబ్బందులు తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. ఉపాధిహామీ పనుల ద్వారా గ్రామ కార్మికులకు ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాభివృద్ధికి కూడా దోహదపడుతోంది. పనుల్లో పాల్గొంటున్న కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ట్యాబ్లెట్లు, మంచినీళ్లు అందజేశారు. గ్రామ ప్రజలు సర్పంచ్ కృషిని అభినందిస్తూ ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు పనులను తరచూ పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

# టీబీ నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం



**తాండూర్:** క్షయవ్యాధి నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని క్షయవ్యాధి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అచ్చులపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలు, రేచిని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని బలహానుపూర్ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే క్షయవ్యాధిగా అనుమానించి వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రజలకు క్షయవ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై వివరించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, మెడికల్ ఆఫీసర్ జాన్సిరాణి ఆదేశాల మేరకు అవగాహన పోస్టర్లను గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఆవిష్కరించారు. అనంతరం ప్రజలు, సిబ్బందితో క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో క్షయవ్యాధి నిర్ధారణకు ఉచితంగా తెమడ పరీక్షలు, ఎక్స్రే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచిత చికిత్సతో పాటు చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల రూ.వెయ్యి పోషణ భత్యం ప్రభుత్వం అందిస్తోందన్నారు. 150 మంది లక్ష్యంగా ఎక్స్రే పరీక్షలు నిర్వహించగా, 131 మందికి పోర్టబుల్ హ్యాండ్ ఎక్స్రే చేశారు. 26 మంది నుంచి తెమడ నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పీలు ప్రసన్న, దౌలత్, హెల్త్ సూపర్ వైజర్ రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు స్రవంతి, శ్రీలత, ఆశా కార్యకర్తలు హారిక, మంజుల, నర్సు, గంగుభాయి, సునీత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

**అదనపు కలెక్టర్ చంద్రయ్య**


**తాండూర్:** వేసవిలో తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం తాండూర్ మండలంలోని చౌటపల్లి గ్రామపంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. పీఎం అజయ్ పథకానికి ఎంపికైన సందర్భంగా చేపట్టనున్న పనుల వివరాలను తెలుసుకుని, ప్రాజెక్టు పనులు సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, డ్రైన్ల పూడికతీత పనులను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అలాగే నర్సరీ, వైకుంఠ ధామం, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణపై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కె.సతీష్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, చౌటపల్లి గ్రామ సర్పంచ్ ముదాం సునీత, పంచాయతీ కార్యదర్శి వసంత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు



**ఆదిలాబాద్:** జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, ప్రజలకు అవసరమైన మేరకు నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రుతో కలిసి చమురు కంపెనీల సేల్స్ అధికారులు, బంక్ డీలర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్ ఇంధన సరఫరా సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రవాణా ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో పెట్రోల్ బంకుల వద్ద ఇంధన లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి నిల్వలను దాచిపెట్టి వినియోగదారులను ఇబ్బంది పెడితే నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు, పుకార్లను నమ్మి ప్రజలు బంకుల వద్ద రద్దీ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు చమురు కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన గూగుల్ మీట్లో డిపోల నుంచి బంకులకు చేరుతున్న సరఫరా తీరును సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నందిని, వివిధ శాఖల అధికారులు, ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు, జిల్లా పెట్రోల్ డీలర్లు పాల్గొన్నారు.




# ఈ స్మార్ట్‌ఫోన్లలో వాట్సాప్ బంద్

**న్యూఢిల్లీ:** ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన వినియోగదారులకు భారీ షాకిచ్చింది. పాత ఆండ్రాయిడ్ వెర్షన్లపై నడుస్తున్న స్మార్ట్‌ఫోన్లలో తమ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యంగా ఆండ్రాయిడ్ 5.0, 5.1 మరియు అంతకంటే తక్కువ వెర్షన్ సాఫ్ట్‌వేర్ కలిగిన ఫోన్లలో సెప్టెంబర్ 8వ తేదీ నుంచి వాట్సాప్ సేవలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా కొత్త ఫీచర్లను అందించడం, వినియోగదారుల డేటాకు భద్రత కల్పించడం పాత వెర్షన్లలో సాధ్యం కాకపోవడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని కంపెనీ వెల్లడించింది. ఇప్పటికే ఈ మార్పుకు ప్రభావితమయ్యే యూజర్లకు వాట్సాప్ వ్యక్తిగత సందేశాల ద్వారా ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తోంది. వాట్సాప్ తీసుకున్న ఈ నిర్ణయం కేవలం ఆండ్రాయిడ్ యూజర్లకు మాత్రమే వర్తిస్తుందని యాజమాన్యం స్పష్టం చేసింది. ఆండ్రాయిడ్ 6.0 మరియు ఆపై వెర్షన్లు వాడుతున్న వారికి ఎప్పటిలాగే సేవలు అందుబాటులో ఉంటాయి. ఇక ఆపిల్ ఐఓఎస్ వినియోగదారుల విషయానికి వస్తే, ఐఓఎస్ 15.1 లేదా అంతకంటే తాజా వెర్షన్లు కలిగిన ఐఫోన్లలో వాట్సాప్ ఎటువంటి అంతరాయం లేకుండా పనిచేస్తుందని పేర్కొంది. వాట్సాప్ సాధారణ అకౌంట్లతో పాటు వాట్సాప్ బిజినెస్ ఖాతా వాడుతున్న వారికి కూడా పాత వెర్షన్లలో ఈ నిబంధన వర్తిస్తుందని, ఆండ్రాయిడ్ 5.0 లోపు ఫోన్లలో బిజినెస్ ఖాతాలు కూడా ఆగిపోతాయని సంస్థ తెలిపింది.

## చాట్ బ్యాకప్ తీసుకోవాలని సూచన

సెప్టెంబర్ 8 నుంచి వాట్సాప్ సేవలు నిలిచిపోనున్న నేపథ్యంలో, పాత ఫోన్లను వాడుతున్న వారు తమ ముఖ్యమైన చాట్ హిస్టరీని కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే వెంటనే గూగుల్ డ్రైవ్ లేదా ఇతర క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్‌లో తమ డేటాను బ్యాకప్ చేసుకోవాలని వాట్సాప్ సూచించింది. పాత ఫోన్ల నుంచి కొత్త స్మార్ట్‌ఫోన్లకు మారే వారు తమ చాట్ హిస్టరీని సులభంగా బదిలీ చేసుకునే అవకాశం ఉందని గుర్తు చేసింది. వినియోగదారుల ప్రైవసీ, సెక్యూరిటీ విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఎప్పటికప్పుడు కాలం చెల్లిన సాఫ్ట్‌వేర్ వెర్షన్లను తొలగిస్తున్నట్లు







# జొమాటో లాభాల జాతర

- క్యూ4లో ఏకంగా 346 శాతం జంప్!
- రూ. 17,292 కోట్లకు చేరిన ఆదాయం..
- బ్లింకిట్ వ్యాపారంలో భారీ వృద్ధి
- చివరి నిమిషంలో 'స్టాక్' మ్యాజిక్..
- 4 శాతం నష్టం నుంచి లాభాల్లోకి షేరు

**ముంబై/న్యూఢిల్లీ:** ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్ మాతృ సంస్థ 'ఎటర్నల్', 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కళ్లు చెదిరే ఫలితాలను సాధించింది. మంగళవారం వెల్లడించిన క్యూ4 ఫలితాల ప్రకారం, కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన ఏకంగా 346 శాతం వృద్ధి చెంది రూ. 174 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే సమయంలో కేవలం రూ. 39 కోట్ల లాభాన్ని మాత్రమే ఆర్జించిన సంస్థ, ఈసారి నాలుగింతల కంటే ఎక్కువ లాభాన్ని గడించడం విశేషం. కంపెనీ కార్యకలాపాల ఆదాయం కూడా అనూహ్యంగా 196 శాతం ఎగబాకి రూ. 17,292 కోట్లకు చేరుకుంది. కిందటి త్రైమాసికంతో పోల్చినా లాభం, ఆదాయం రెండూ మెరుగైన వృద్ధిని కనబరచడం ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపింది.

## మెరిసిన బ్లింకిట్.. పెరిగిన ఆర్డర్ల జోరు

కంపెనీ మొత్తం ఫలితాల్లో క్విక్ కామర్స్ విభాగం 'బ్లింకిట్' కీలక పాత్ర పోషించింది. బ్లింకిట్ నెట్ ఆర్డర్ వాల్యూ ఏడాది కాలంలో ఏకంగా 95.4 శాతం పెరగడం సంస్థ బలాన్ని చాటుతోంది. సమీక్షా త్రైమాసికంలో కొత్తగా 216 స్టోర్లను ప్రారంభించడంతో బ్లింకిట్ మొత్తం స్టోర్ల సంఖ్య 2,243కు చేరుకుంది. ఇక ప్రధాన వ్యాపారమైన జొమాటో ఫుడ్ డెలివరీ ఆర్డర్ వాల్యూ కూడా 18.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. వీటితో పాటు టికెటింగ్ ప్లాట్‌ఫామ్ 'డిస్ట్రిక్ట్' ఆదాయం 46 శాతం పెరగడమే కాకుండా నష్టాలను గణనీయంగా తగ్గించుకుంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ నికర లాభం రూ. 366 కోట్లుగా ఉండగా, వార్షిక ఆదాయం రూ. 54,364 కోట్లుగా నమోదైంది.

## స్టాక్ మార్కెట్‌లో అనూహ్య మలుపు

మంగళవారం ట్రేడింగ్ సెషన్‌లో ఫలితాల వెల్లడికి ముందు జొమాటో షేరు తీవ్ర ఒత్తిడికి గురైంది. మార్కెట్ నష్టాల్లో ఉండటంతో ఒక దశలో 4 శాతానికి పైగా పడిపోయి రూ. 245 వద్ద కనిష్ఠాన్ని తాకింది. అయితే, మార్కెట్ ముగియడానికి




కొద్ది నిమిషాల ముందు (మధ్యాహ్నం 3 గంటలకు) ఫలితాలు వెలువడటంతో షేరు ఒక్కసారిగా రాకెట్‌లా దూసుకెళ్లింది. కనిష్ఠ స్థాయి నుంచి దాదాపు 5 శాతానికి పైగా కోలుకున్న షేరు, చివరకు 1.09 శాతం లాభంతో రూ. 258.28 వద్ద ముగిసింది. ఈ జంప్‌తో జొమాటో మార్కెట్ విలువ రూ. 2.30 లక్షల కోట్లకు చేరుకుంది. కంపెనీ ప్రదర్శించిన ఆర్థిక స్థిరత్వం రాబోయే రోజుల్లో ఇన్వెస్టర్ల నమ్మకాన్ని మరింత పెంచుతుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మారుతీ సుజుకీ లాభంలో స్వల్ప క్షీణత




- ఇన్వెస్టర్లకు భారీగా డివిడెండ్ ప్రకటన!
- రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చినా లాభం డౌన్..
- ఒక్కో షేరుకు ₹140 డివిడెండ్‌కు బోర్డు ఆమోదం
- క్యూ4లో రూ. 3,659 కోట్ల నికర లాభం..
- ఎగుమతుల్లోనూ సరికొత్త రికార్డు

**ఢిల్లీ:** దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ మంగళవారం తన ఆర్థిక ఫలితాలను వెల్లడించింది. మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో కంపెనీ రూ. 3,659 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ. 3,911.1 కోట్లతో పోలిస్తే ఇది 6.45 శాతం తక్కువ కావడం గమనార్హం. నిర్వహణేతర లాభాలు క్షీణించడం, బాండ్ల రాబడులు తగ్గడం వంటి మార్కెట్ పరిస్థితుల ప్రభావం వల్ల లాభాల్లో ఈ తగ్గుదల కనిపించిందని కంపెనీ వివరించింది. అయితే, కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం గతేడాది కంటే 28.2 శాతం వృద్ధితో రూ. 40,920 కోట్ల నుంచి రూ. 52,462 కోట్లకు పెరిగి రికార్డు సృష్టించింది. కేవలం ఒక్క త్రైమాసికంలోనే రూ. 50 వేల కోట్ల విలువైన విక్రయాలు జరిపినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది.

## రికార్డు విక్రయాలతో పెరిగిన ఆదాయం

గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి గాను మారుతీ సుజుకీ అద్భుతమైన వృద్ధిని కనబరిచింది. ఏడాది మొత్తం మీద కంపెనీ ఆదాయం రూ. 1,52,913 కోట్ల నుంచి రూ. 1,83,316 కోట్లకు చేరగా, పూర్తి స్థాయి నికర లాభం రూ. 14,679.5 కోట్లుగా నమోదైంది. వాహన విక్రయాల విషయానికి వస్తే, సమీక్షా త్రైమాసికంలో మొత్తం 6,76,209 యూనిట్లను కంపెనీ విక్రయించింది. ఇందులో 5.38 లక్షల వాహనాలు దేశీయ మార్కెట్లో అమ్ముడుపోగా, 1.37 లక్షల యూనిట్లు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. ఏడాది మొత్తంగా చూస్తే 19.74 లక్షల వాహనాలను దేశీయంగా, 4.47 లక్షల యూనిట్లను అంతర్జాతీయ మార్కెట్లకు పంపిణీ చేసినట్లు మారుతీ సుజుకీ వెల్లడించింది.

## షేర్ హోల్డర్లకు కాసుల వర్షం

లాభాల్లో స్వల్ప క్షీణత ఉన్నప్పటికీ, కంపెనీ తన వాటాదారులకు భారీ డివిడెండ్‌ను ప్రకటించడం విశేషం. ఒక్కో షేరుకు రూ. 140 చొప్పున డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు ( న్ సిగ్నల్ ఇచ్చింది. వాహన విక్రయాల్లో సాధించిన రికార్డులు మరియు భవిష్యత్తులో లాభాలు మరింత మెరుగుపడతాయన్న ధీమాతో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్-టు-మార్కెట్ ప్రభావం వల్ల కనిపిస్తున్న లాభాల క్షీణత తాత్కాలికమేనని, ముమ్ముందు ఈ లోటు భర్తీ అవుతుందని యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. దేశీయ వాహన రంగంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూనే, ఎగుమతుల్లోనూ సరికొత్త మైలురాళ్లను అధిగమిస్తున్నామని కంపెనీ స్పష్టం చేసింది.

# టెక్నాలజీ వర్సెస్ ట్రెడిషన్



- 50 ఏళ్ల నాటి క్లాసిక్ కారు చేతిలో టెస్లా పరాభవం!
- డ్రాగ్ రేసులో దూసుకెళ్లిన 1970 షివర్లే చెవెల్ మాలిబు..
- వైరల్‌గా మారిన వీడియో
- ఆధునిక ఈవీ టెక్నాలజీపై పాతకాలపు 'మసిల్ పవర్' పైచేయి



**న్యూఢిల్లీ:** ఆధునిక సాంకేతికతకు మారుపేరుగా నిలిచే టెస్లా సైబర్‌ట్రక్‌కు రేసింగ్ ట్రాక్ మీద ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో క్రేజ్ ఉన్న ఈ ఎలక్ట్రిక్ ట్రక్కును, సుమారు ఐదు దశాబ్దాల క్రితం నాటి అమెరికన్ క్లాసిక్ మసిల్ కారు '1970 షివర్లే చెవెల్ మాలిబు' మట్టికరిపించింది. క్వార్టర్ మైల్ (400 మీటర్లు) లక్ష్యంగా జరిగిన ఈ డ్రాగ్ రేసులో సైబర్‌ట్రక్ ఓటమి పాలవ్వడం ఇప్పుడు వాహన ప్రేమికుల్లో చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతూ, పాత ఇంజనీరింగ్ వర్సెస్ ఆధునిక టెక్నాలజీ అనే చర్చకు దారితీసింది.

## శక్తిమంతమైన 'సైబర్‌బీస్ట్' బేజారు

ఈ పోటీలో టెస్లాకు చెందిన టాప్ ఎండ్ వేరియంట్ 'సైబర్‌బీస్ట్' పాల్గొంది. ట్రై-మోటార్ సెటప్‌తో 845 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేసే ఈ వాహనం, వేగంలో మేటి అని పేరు తెచ్చుకుంది. అయితే, దీనికి పోటీగా వచ్చిన షివర్లే చెవెల్ సాధారణ కారు కాదు. డ్రాగ్ రేసుల కోసం ప్రత్యేకంగా రీ-డిజైన్ చేసిన ఈ కారులో శక్తిమంతమైన ఎ8 ఇంజిన్‌ను అమర్చారు. రేసు ప్రారంభమైన తృటి కాలంలోనే షివర్లే డ్రైవర్ మెరుపు వేగంతో స్పందించి మెరుగైన ట్రాక్షన్‌ను సాధించడంతో, ఆరంభంలోనే భారీ ఆధిక్యం లభించింది.

## డ్రైవర్ సెకను కాలం ఆలస్యం.. సైబర్‌ట్రక్ ఓటమికి కారణం

ఎలక్ట్రిక్ పవర్ కారణంగా సైబర్‌ట్రక్ రేసు మధ్యలో అత్యంత వేగాన్ని పుంజుకుని షివర్లేకు అత్యంత చేరువగా వచ్చినప్పటికీ, చివరి నిమిషంలో ఫలితాన్ని మార్చలేకపోయింది. స్వల్ప తేడాతో షివర్లేనే ముగింపు ' తను ముందుగా తాకి విజేతగా నిలిచింది. సైబర్‌ట్రక్ డ్రైవర్ ప్రారంభంలో స్పందించడంలో కొద్దిగా ఆలస్యం చేయడమే ఈ ఓటమికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రేసు ఫలితం ఎలా ఉన్నా, ఆధునిక ఈవీ టెక్నాలజీకి, పాతకాలపు ఐసీఈ ఇంజనీరింగ్‌కు మధ్య ఉన్న పోరాటం ప్రేక్షకులకు కనువిందు చేసింది.

